సాక్షి
జనగామ
సోమవారం | 18 | డిసెంబర్ | 2023



పట్టుతప్పిన పాలన.. - 8లో▸

ఐటీడీఏలో పాలన పట్టుతప్పింది. పాలక మండలి సమావేశం జరగకపోవడంతో ఐటీడీఏకు ఎన్ని నిధులు వస్తున్నాయి.. అవి ఎటు పోతున్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.



వార సంతలో సౌకర్యాలు నిల్

బచ్చన్నపేట మండలంలో ప్రతి ఆదివారం నిర్వహించే వార సంతలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. - 9లో▸

గరిష్టం/కనిష్టం
28⁰/14⁰

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'విశ్వకర్మ యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి



జనగామ రూరల్: ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. ఆదివారం పట్టణంలోని 23, 24, 25 వార్డుల్లో అసెంబ్లీ కన్వీనర్ బల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పథకాన్ని ప్రారంభించి విధి విధానాలు వివరించారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ 18 రకాల చేతి వృత్తుల కులాల వారికి ప్రయోజన కరంగా ఉండడానికి రూ.13 వేల కోట్లతో పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రూ. 3 లక్షలతో పథకంలో రుణాలు అందజేస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఉపయోగించుకోని ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి




జనగామ రూరల్: ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎర్రోజు రామస్వామి అన్నారు. ఆదివారం పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ రాజేష్ చంద్ర హాజరై జిల్లాలోని 18 మంది సీనియర్ పెన్షనర్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య, కార్యదర్శి రామచంద్రం, కోశాధికారి సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు మర్రి జనార్దన్ రెడ్డి, మహిళ ఉపాధ్యక్షురాలు గాదె కాథరిన్, లక్ష్మయ్య, భుజంగ రెడ్డి, మంజుల, ఎస్. వెంకటయ్య, మాధవ రెడ్డి, సరళ, ధనలక్ష్మి, ఉమామహేశ్వర్, సంజీవ రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఎస్‌వీఎల్ఎన్ చారి, యాదగిరి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జఫర్‌గఢ్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని స్థానిక గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సమత తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశానికి ఇప్పటి నుంచే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్, సీఎంఏ క్లాటు పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్చక ఉద్యోగులు అధైర్యపడొద్దు



పాలకుర్తి టౌన్: దేవాదాయ శాఖలో పని చేస్తున్న అర్చక, ఉద్యోగులు అధైర్యపడొద్దని త్వరలో సమస్యలు పరిష్కరించే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని అర్చక, ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డీవీఆర్‌శర్మ తెలిపారు. ఆదివారం ఏఐసీసీ జనరల్ సెక్రటరీ ఎంఏ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో అర్చక, ఉద్యోగుల హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి సమస్యలను విన్నపించుకున్నారు. ఈ సందర్భంగా డీవీఆర్‌శర్మ మాట్లాడుతూ అర్చక ఉద్యోగులకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, అధైర్య పడొద్దని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంద్‌శర్మ, ఉపాధ్యక్షుడు తక్కర్శు సత్యం, ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాంసుదర్‌గౌడ్, టీడీఎస్ఎస్ ఉపాధ్యక్షులు నరేందర్‌లతోపాటు అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ జిల్లా కమిటీ

జనగామ రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ పూలే అధ్యయన వేదికలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యామ్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్ అధ్యక్షతన మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శ్యామ్ మాట్లాడారు. అనంతరం మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గద్దల కిషోర్, అధికార ప్రతినిధిగా సందేన రవీందర్, ప్రధాన కార్యదర్శిగా జేరుపోతుల సుధాకర్, ఉపాధ్యక్షుడిగా గువ్వల రవి తదితరులను ఎన్నుకున్నారు.



గద్దెల కిశోర్, అధ్యక్షుడు

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

- ఉదయం, సాయంత్రం గంట చొప్పున బోధన
- జిల్లాలో 182 స్కూళ్లు.. 6,692 మంది టెన్త్ విద్యార్థులు



ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న విద్యార్థులు

జనగామ రూరల్: వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రణాళికలతో ముందుకు పోతున్నారు. పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు రాణించాలంటే ఆత్మవిశ్వాసం, పట్టుదలతో చదవాలి. ఇందుకు ఉపాధ్యాయులు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. నవంబర్ మొదటి వారంలో ప్రత్యేక తరగతులు ప్రారంభమైనా ఎన్నికలు రావడంతో ఇటీవల కొంత బ్రేక్ పడింది. తిరిగి ప్రత్యేక తరగతులకు ఉద్యుక్తమయ్యారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులపై పూర్తి స్థాయిలో పట్టు సాధించేలా అవసరమైన చర్యలు చేపట్టారు. ఇందుకు ప్రత్యేకంగా 'లక్ష్య' పేరుతో పదో తరగతి విద్యార్థులకు విద్యాశాఖ నిర్ణయించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం పరీక్షల వరకు ప్రతీరోజు గంట పాటు సబ్జెక్టుల వారీగా అదనంగా తరగతులు నిర్వహించి అదే రోజు స్లిప్ టెస్టులు పెడుతున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాల్లో సందేహాలుంటే సంబంధిత ఉపాధ్యాయులకు నేరుగా ఫోన్ చేసి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించారు. చదువులో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటున్నారు.

2021–22లో 94.72 శాతం

2018– 19 సంవత్సరం జిల్లా పదో తరగతి ఫలితాలు 97.15 సాధించింది. 2019–2020 కరోనా సమయంలో ప్రభుత్వం అందరినీ పాస్ చేసింది. ఆ తర్వాత విద్యార్థుల చదువుపై దృష్టి సారించి ప్రత్యేక తరగతులు ప్రారంభించింది. 2021–22లో 94.72 శాతం ఫలితాలు వచ్చాయి. అప్పటి నుంచి స్పెషల్ క్లాసులపై దృష్టి పెట్టారు.

ప్రత్యేక తరగతులు..

ప్రతీ రోజు పాఠశాల ప్రారంభానికి ముందు ఉదయం 8.30 నుంచి 9.30 వరకు గంటలపాటు, సాయంత్రం పాఠశాల ముగిశాక 4.30 నుంచి 5.30 వరకు అదనంగా తరగతులు నిర్వహిస్తున్నారు. డీఈఓతో పాటు సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, పాఠశాల హెచ్ఎంలు తరగతుల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి ఆరు పేపర్లతోనే పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 182 పాఠశాలలు ఉండగా.. 6,692 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్ష రాయనున్నారు.

దాతలు సహకరించాలి

పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న కారణంగా సాయంత్రం వరకు వారు పాఠశాలలోనే ఉండాలి. అయితే ఆకలితో ఇబ్బంది పడుతున్నారు. చదువుపై శ్రద్ధ పెట్టడం కొంత కష్టమే. సాయంత్రం పూట అల్పాహారం, స్నాక్స్ వంటివి అందిస్తే విద్యార్థులు మరింత పట్టుదలతో చదివే అవకాశం ఉంటుంది. ఇందుకు ఆయా గ్రామాల్లో దాతలు ముందుకు వస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఆత్మవిశ్వాసం పెరుగుతోంది..



ప్రత్యేక తరగతులతో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. ఇప్పటికే చదివిన అంశాలు రివిజన్ చేసుకుంటున్నాం. పరీక్షలంటే భయం పోయేలా సలహాలు ఇస్తూ స్లిప్ టెస్టులు నిర్వహిస్తున్నారు.

– దివ్య, గానుగుపహాడ్, ప్రభుత్వ పాఠశాల

పాఠ్యాంశాల వారీగా తరగతులు



పరీక్షలకు సమయం దగ్గర పడుతోంది. చదువులో వెనుకబడి ఉన్న వారికి సబ్జెక్టుల వారీగా సంబంధిత ఉపాధ్యాయుడితో ప్రత్యేక తరగతి తీసుకుంటున్నారు. సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

– జి.శ్రీశాంత్(ఇంగ్లిష్ మీడియం), గానుగుపహాడ్

మంచి ఫలితాలు సాధిస్తాం



ప్రతీరోజు సబ్జెక్టుల వారీగా గంట పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. క్లాస్ పూర్తి కాగానే స్లిప్ టెస్ట్ పెడుతున్నాం. దీంతో ఆయా సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా కృషి చేస్తున్నాం.

– రాజేందర్, గణిత ఉపాధ్యాయుడు, గానుగుపహాడ్ ప్రభుత్వ పాఠశాల

వంద శాతం ఉత్తీర్ణత..



ప్రత్యేక తరగతులతో విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయం తొలగి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వంద శాతం ఫలితాలే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రణాళిక అమలు చేస్తున్నాం.

– కె.రాము, డీఈఓ

అడవిబిడ్డకు అపూర్వ స్వాగతం



వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు ప్రజలు



మల్లంపల్లిలో మాట్లాడుతున్న సీతక్క



సమ్మక్కకు మొక్కుతున్న మంత్రి సీతక్క

- ప్రమాణ స్వీకారం తర్వాత తొలిసారి ములుగుకు వచ్చిన మంత్రి సీతక్క
- మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి విజయోత్సవ ర్యాలీ
- గట్టమ్మ తల్లికి ప్రత్యేక పూజలు
- సమ్మక్క–సారలమ్మ దర్శనం
- తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు

ములుగు/ములుగు రూరల్: రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం ఆదివారం తొలిసారిగా నియోజకవర్గంలో అడుగు పెట్టిన ఆమెకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. అనంతరం ములుగు జిల్లా ప్రారంభమయ్యే తొలి గ్రామం మహ్మద్‌గౌస్‌పల్లి నుంచి విజయోత్సవ ర్యాలీ మొదలైంది. ఇక్కడ కార్యకర్తలు మంత్రిని గజమాలతో సన్మానించారు. ర్యాలీ మల్లంపల్లి, జాకారం, ములుగు, జంగాలపల్లి, జవహర్‌నగర్, మచ్చాపూర్, చల్వాయి, గోవిందరావుపేట, పస్రాల మీదుగా మేడారం వరకు కొనసాగింది.

ప్రజలే నా కుటుంబ సభ్యులు..

ర్యాలీ సందర్భంగా మల్లంపల్లి వద్ద, ములుగులో సీతక్క మాట్లాడుతూ.. ములుగు నియోజకవర్గం నా ఇల్లు.. ప్రజలే నా కుటుంబ సభ్యులు.. భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. 20 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ ప్రజలకు దూరంగా ఉండలేదని, అధికారం ఉందనే భావనను మరిచి ప్రజల మధ్యలో ఉండి వారికి సేవ చేస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం మంత్రిగా ఉన్నా ములుగు ఆడబిడ్డగా, ఆత్మీయ సోదరిగానే ప్రజల కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటూ ముందుకుసాగుతానన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానని చెప్పారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీ, జెడ్పీటీసీ, సింగిల్ విండో ఎన్నికల్లో ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలని పార్టీ ప్రజా ప్రతినిధులను కోరారు. అనంతరం జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీ, ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు సీతక్క పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్న తర్వాత ఐటీడీఏ అతిథి గృహంలో మేడారం జాతరపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

గట్టమ్మకు చీర సారె..

గట్టమ్మ ఆలయం వద్ద మంత్రికి మహిళలు కోలాటాలు, బంజార, ఆదివాసీ నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె గట్టమ్మ తల్లికి చీరసారె, పసుపు–కుంకుమలు సమర్పించి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి ప్రచార రథంలో ములుగు వరకు ర్యాలీగా వచ్చారు. మంత్రి పర్యటనకు ఎస్పీ గౌష్‌ఆలం ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి కూచన రవళి రెడ్డి, కిసాన్ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బానోత్ రవిచందర్, వంగ రవియాదవ్‌తోపాటు అధికార ప్రతినిధి అహ్మద్‌పాషా, సీనియర్ నాయకుడు బాధం ప్రవీణ్ కుమార్, ఒజ్జల కుమార్, ఇమ్మడి రాజుయాదవ్, పట్టణ అధ్యక్షుడు చింత నిప్పుల భిక్షపతి, రేవంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు



మాట్లాడుతున్న ఐఏఎస్ అధికారి ఆర్‌కే జేనా

- ఐఏఎస్ అధికారి ఆర్‌కే జేనా

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు బాధ్యతగా పనిచేయాలని సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్‌కే జేనా అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఎస్‌బీఐ ద్వారా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, ఆర్థిక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా డివిజన్ కేంద్రమైన ఘన్‌పూర్‌లో ఆదివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పేదవర్గాలకు ఉపాధి కల్పన కోసం అనేక రకాలైన బ్యాంకు రుణాలను ప్రభుత్వం అందిస్తుందని, పేదలు, అట్టడుగు వర్గాలకు చేయూతను అందిస్తున్నారన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పథకాలను అందిస్తుందని, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్‌పెన్షన్, జన్‌ధన్, సుకన్య సమృద్ధి, ముద్ర యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ అనీల్ కుమార్, నాబార్డు ఏజీఎం చంద్రశేఖర్, ఎస్‌బీఐ అధికారులు వినయ్, హిమాన్షు, ఘన్‌పూర్ ఎస్‌బీఐ మేనేజర్ సురేష్‌బాబు, ఎల్‌డీఎం శ్రీధర్, ఘన్‌పూర్ సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఈఓ సత్యనారాయణ, శివునిపల్లి తాత్కాలిక సర్పంచ్ బూర్ల విష్ణు, సీఎఫ్ఎల్‌లు నీల రాకేష్, నాగబండి సంతోష్, జోగు థామస్, బ్యాంకర్లు, ఐకేపీ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హత కలిగిన వారందరూ వినియోగించుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు అన్నారు. ఆదివారం మండలంలోని కేసిరెడ్డిపల్లి, కొడవటూర్ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మల్లవరం దివ్య, గంగం సతీష్‌రెడ్డి, కౌన్సిలర్ మల్లవరం అరవింద్‌రెడ్డి, డాక్టర్ ఝాన్సీ. ఏఈఓ అజయ్, పంచాయితీ కార్యదర్శి రూపా చైతన్య, అనిల్‌రాజ్, ఏఎస్ఎం సునంద, వీవోఏ మల్లం శోభ, గంగం వాణి, అనూష, అంగన్‌వాడీలు, ఆశలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా ఉర్సు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో దర్గా హజరత్ సయ్యద్ మీరా మోహియుద్దీన్ షాఖాద్రి రహ్మతుల్లా అలై ఉర్సు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ బాధ్యులు షౌకత్ తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ఉత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కందుల రేఖ, ఏసీపీ శ్రీనివాసరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, నాగరబోయిన యాదగిరి, సర్పంచ్ గోవిందు ఆనందం, ఎంపీటీసీ బెల్లపు వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి
- నన్నూరు వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రాయపర్తి : మండలంలోని నన్నూరు వేంకటేశ్వర స్వామి ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సూచించారు. ఎమ్మెల్యే దంపతులు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్‌తో చర్చించారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని పేర్కొన్నారు. అనంతరం వధూవరులను ఆశీర్వదించారు. పలువురు అభిమానులు, కార్యకర్తలతో సెల్ఫీ దిగారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యా నాయక్, నిరంజన్‌రెడ్డి, సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, కుందూరు విక్రంరెడ్డి, మహేందర్‌రెడ్డి, చినపాక ఎల్లయ్య పాల్గొన్నారు.

విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా వెంకటేశం

- ఓబుల్ కేశ్వాపూర్‌లో సంబురాలు

జనగామ: జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ మారుమూల గ్రామానికి చెందిన (1995 ఐఏఎస్ బ్యాచ్) బుర్రా వెంకటేశం గౌడ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆదివారం సొంత గ్రామంలో సంబురాలు జరుపుకున్నారు. ప్రస్తుతం ఆయన ప్రభుత్వ కార్యదర్శి, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా కొనసాగుతుండగా, నేడు (సోమవారం) నూతన బాధ్యతలు చేపట్టనున్నారు. మొట్టమొదటి సారిగా 1995లో తెలంగాణ కేడర్ నుంచి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారిగా నియమితులయ్యారు. 2005 నుంచి 2008 వరకు మెదక్ జిల్లాకు జిల్లా కలెక్టర్‌గా పని చేశారు. 2014 ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ కమిటీలో ముగ్గురు సీనియర్ ఐఏఎస్ సభ్యుల బృందంలో వెంకటేశం ఒకరు. అనంతరం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో రాష్ట్రానికి మొదటి హోం సెక్రటరీగా బాధ్యతలను స్వీకరించారు. సాంస్కృతిక కార్యదర్శిగా పని చేసిన సమయంలో హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ స్వీట్స్, స్నాక్స్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ హోదాలో బుర్రా వెంకటేశం సొంత జిల్లా అయిన జనగామకు విద్యా పరంగా మంచి రోజులు రానున్నాయని విద్యావంతులు ఆశిస్తున్నారు.

సంతోషంగా ఉంది..



తమ గ్రామానికి చెందిన బుర్రా వెంకటేశం విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితో పాటు అదనపు బాధ్యతలుగా కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించడంతో ఊరిలో సంతోషం వెల్లివిరుస్తుంది. జిల్లాలో ఉన్నత, సాంకేతిక విద్య మరింత బలోపేతం అయ్యేందుకు దోహద పడుతుంది.

– కొడెపాక అనిల్, ఓబుల్ కేశ్వాపూర్

నెరవేరనున్న రెండు దశాబ్దాల కల

- సీపీఎస్ రద్దు ప్రకటనతో టీచర్ల సంబురాలు
- జిల్లాలో 2,500 మందికి లబ్ధి
- జీవిత కాలం పెన్షన్ రానుండడంతో వెల్లివిరుస్తున్న సంతోషం



జనగామ: ఉపాధ్యాయుల రెండు దశాబ్దాల కల నెరవేరనుంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి.. ఓల్డ్ పెన్షన్ పథకం (ఓపీఎస్) తీసుకువస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే ప్రకటనతో టీచర్లలో సంతోషం వెల్లివిరిస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తుండగా.. అధికారిక జీఓ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. పాత పెన్షన్ విధానంతో జిల్లాలో అన్ని శాఖల్లో కలుపుకుని సుమారు 25 వందల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు లబ్ధిచేకూరనుంది.

ఉమ్మడి రాష్ట్రంలో నాటి ప్రభుత్వం 2004 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సీపీఎస్ విధానం అమలు చేసింది. దీంతో సీపీఎస్ నాటికి ఉద్యోగంలో చేరిన వారికి పదవీ విరమణ పొందిన తర్వాత.. పెన్షన్ విధానం వర్తించకుండా పోయింది. ఈ విధానం పూర్తిగా షేర్ మార్కెట్ ఒడిదుడుకులపై ఆధారపడి ఉంటుంది. పాలక ప్రభుత్వాల నిర్ణయాలతో ఉద్యోగ విరమణ తర్వాత భద్రత లేకుండా పోయింది. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో దశాబ్దాల కాలం నుంచి పోరాటాలు చేస్తూనే ఉన్నారు. సీపీఎస్ రద్దు విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలకే బాధ్యత అప్పగించగా.. తెలంగాణ మినహా.. పలు స్టేట్ గవర్నమెంట్ ఓల్డ్ పెన్షన్ విధానం అమలులోకి తీసుకువచ్చారు. కాంగ్రెస్ ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో సీపీఎస్ రద్దు విషయమై స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పూర్తి మద్దతు పలికారు. ఈ విషయం పోస్టల్ బ్యాలెట్ ద్వారా రుజువైన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సీపీఎస్ రద్దు విషయమై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రకటన చేయడంతో జిల్లా వ్యాప్తంగా సంబురాలు అంబరాన్నంటాయి.

ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్

పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి చివరి నెల వేతనంలో సగం జీతం కనీసంగా పెన్షన్ వచ్చేది. ఆ తర్వాత నామినీకి వర్తింపజేసేవారు. కానీ నూతన పెన్షన్ (సీపీఎస్) విధానంలో పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే పెన్షన్ వద్ధాప్య పెన్షన్ కన్నా తక్కువగా వచ్చే అవకాశం ఉంది. సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయడంతో జీవిత కాలం భద్రతకు భరోసా దొరుకుతుంది.


ప్రకటన చేయడం హర్షణీయం



కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా సీపీఎస్ రద్దు చేస్తామని అసెంబ్లీలో మాట్లాడడం స్వాగతిస్తున్నాం. 2004 తర్వాత నియామకమైన ఉద్యోగులకు సీపీఎస్ విధానం అమలవుతుంది. చాలామంది సీపీఎస్ ఉద్యోగులు పదవీ విరమణ పొందిన తర్వాత పెన్షన్ సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. సీపీఎస్ ఉద్యోగులుగా తామంతా సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– హన్మాండ్ల భాస్కర్, టీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు



కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటోంది. అసెంబ్లీలో ఎమ్మెల్యే దీనిపై మాట్లాడడం మాలో సంతోషాన్ని నింపింది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తమ 20 ఏళ్ల పోరాటానికి త్వరగా న్యాయం జరిగేలా చూడాలని విన్నపం.

– రావుల మనోహర్, టీసీపీఎస్ఈఏ స్టేట్ అసోసియేట్ ప్రెసిడెంట్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


రాము మృతదేహం

డోర్నకల్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం డోర్నకల్ మండలం ఉయ్యాల వాడ గ్రామంలో జరిగింది. మండలంలోని అమ్మపాలెంలో పంటపొలాల వద్ద కరీంనగర్‌కు చెందిన సతీష్.. విద్యుత్ కనెక్షన్ తీసుకుని హార్వెస్టర్‌కు వెల్డింగ్ పనులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురికాగా స్థానికులు వెంటనే సతీష్‌ను 108లో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా విద్యుత్ స్తంభంపై గల తీగలు తొలగించేందుకు వెళ్లిన డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన వంగూరి రాము (40) కూడా విద్యుదాఘాతంతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడి

నల్లబెల్లి: ఓ కామంధుడు ఓ మతిస్థిమితం లేని మహిళపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆల్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని దస్తగిరిపల్లి గ్రామానికి చెందిన ఓ మతిస్థిమితం లేని మహిళ(45) ఇంట్లో ఒంటరిగా ఉంది. దీంతో ఇదే అదునుగా భావించిన అదే గ్రామానికి చెందిన కడివెండి కేదారి శనివారం ఇంట్లోకి ప్రవేశించి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీంతో మహిళ కేకలు వేయడంతో కుటుంబీకులు ఘటనా స్థలికి చేరుకోగా వారిని చూసి కేదారి అక్కడి నుంచి పారిపోయాడు. కాగా, కేదారి పలుమార్లు తనపై లైంగికదాడికి పాల్పడినట్లు మహిళ రోదిస్తూ కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో భక్తులకు గాయాలు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని వెంగ్లాపూర్ శివారులో జరిగింది. అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు ఆదివారం కారులో మేడారం వచ్చారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో వెంగ్లాపూర్‌లో శివారులో కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఐదుగురు భక్తుల్లో నలుగురు స్వల్పంగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. గాయపడిన వారిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పట్టుతప్పిన పాలన..

నాలుగేళ్లు గడిచినా ఐటీడీఏ పాలకమండలి సమావేశం ఊసేలేదు


ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయం

- పట్టించుకోని ఉన్నతాధికారులు, పాలకులు
- కొత్త ప్రభుత్వంలోనైనా సమస్యలు పరిష్కారమయ్యేనా?
- ఏటూరునాగారం ఐటీడీఏ.. అవినీతి మయం

ఏటూరునాగారం: గిరిజనులను వివిధ రంగాల్లో మరింత అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో షెడ్యూల్ ట్రైబల్స్ ప్రాంతాల్లో సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లను నెలకొల్పారు. గిరిజనులకు నూరు శాతం ఆర్థిక, సామాజిక, విద్య, వైద్యం, రవాణా, పౌష్టికాహారంతోపాటు మౌలిక వసతులు కల్పించడం ఐటీడీఏ ముఖ్య విధులు. అయితే మూడు నెలలకు ఒకసారి నిధులు, నియామకాలు, పెట్టుబడులు, బడ్జెట్, పాలన, తదితర రంగాల్లోని పురోగతిపై పాలక మండలి సమావేశం జరగాల్సి ఉంది. కానీ ఏటూరునాగారం ఐటీడీఏ పాలకమండలి సమావేశం నాలుగేళ్లైనా ఊసేలేదు. చివరగా 2019 డిసెంబర్ 20వ తేదీన జరిగింది. అప్పటి నుంచి జరగకపోవడంతో ఐటీడీఏకు ఎన్ని నిధులు వస్తున్నాయి? అవి ఏటు పోతున్నాయో అర్థం గాని పరిస్థితి నెలకొంది.

నిధులు పక్కదారి పడుతున్నా పట్టించుకున్న నాథుడే కరువు..

ఐటీడీఏ స్థాపించినప్పటి నుంచి నేటి వరకు 60 దఫాలు పాలకమండలి సమావేశాలు జరిగాయి. అయితే నిధులు పక్కదారి పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇంజనీరింగ్ శాఖలో అనేక అవినీతి, అక్రమాలు జరుగుతున్నా ఏ ఒక్క అధికారి పట్టించుకున్న పాపాన పోవడం లేదు. అంతేకాకుండా ఈ ఏడాది జనవరి 20వ తేదీన కాంట్రాక్టర్ వద్ద డబ్బులను డిమాండ్ చేసిన ఇంజనీరింగ్ అధికారులు డీఈఈ, ఏఈఈలను ఏసీబీ అధికారులు పట్టుకోవడం గమనార్హం. అలా అనేక శాఖల లెక్కల్లో అవకతవకలు నెలకొన్నాయి. అంతేకాకుండా దీర్ఘకాలికంగా ఉద్యోగులు ఇక్కడే మకాం వేయడంతో పాలన గాడితప్పినట్లు ఉంది. గిరివికాసం, పశుసంవర్ధకశాఖ, మత్స్యశాఖ, పట్టు పరిశ్రమ, ఇరిగేషన్, ఈఎస్ఎస్ తోపాటు అనేక పథకాలు పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు.

2014 నుంచి ఆడిటింగ్ బంద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఐటీడీఏకు ఎన్ని నిధులు వచ్చాయి? ఏ మేరకు ఖర్చు అయ్యాయని ప్రతి ఏడాది మార్చి తర్వాత ఆడిటింగ్ చేయాల్సి ఉంది. కానీ 2014 నుంచి 2023 నవంబర్ వరకు జరగలేదు. అయితే ఇటీవల ఆడిటింగ్ చేపట్టారు.

దీర్ఘకాలిక ఉద్యోగులను బదిలీ చేయాలి



ఐటీడీఏలో పదేళ్ల నుంచి విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలి. ఐటీడీఏ పరిధిలో పోడు భూములకు పట్టాలు ఇచ్చారు. కానీ గిరివికాసం పథకంలో భాగంగా బోర్లు వేయడం లేదు. పాలక మండలి సమావేశం ఏర్పాటు చేసి ఐటీడీఏను మరింత ప్రక్షాళన చేయాలి. సంక్షేమ పథకాలు గిరిజనులకు పారదర్శకంగా అందాలి.

\- కబ్బాక శ్రావణ్, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకుడు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 13 మండలాలు ఏజెన్సీ మండలాలున్నాయి. అందులో ఐటీడీఏ ద్వారా ఖర్చు చేసిన వాటి ఓచర్లు, పద్దులు, ఇతర లావాదేవీలు పరిశీలించేందుకు డిపార్ట్‌మెంట్ ఆడిటర్స్ వచ్చారు. వారు ఆడిటింగ్ చేయడం మొదలైంది. కానీ అందులో అవకతవకలు మాత్రం బయట పెట్టలేదు. మీడియాకు ఎలాంటి సమాచారం కూడా ఇవ్వకుండా గోప్యంగా జరిపించారు.

సమస్యలు ఇవే

ఐటీడీఏలో 30 సంవత్సరాల నుంచి రోజువారీ వేతనాలతో సుమారు 30 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గత పాలకమండలి సమావేశంలో ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సభ్యులు తీర్మానం చేశారు. కానీ ఇంత వరకు అమలు జరగలేదు. అలాగే, ఏటూరునాగారంలో బాలికలకు ఇంగ్లిష్ మీడియం జూనియర్ కళాశాల, పీజీ కళాశాల, పీటీసీ సెంటర్ ఉండాలని, వైద్య సేవలు విస్తృతంగా జరపాలని, వాహనాలు అందుబాటులోకి తీసుకురావాలని తీర్మానించారు. ప్రతీ ఏడాది జమ, ఖర్చుల వివరాలు కూడా తేలాల్సి ఉంది.

స్వాతంత్ర్య సమరయోధుడు రామస్వామి మృతి


రామస్వామి పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు


రామస్వామి(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ జిల్లా కొరవి మండలం నేరడ గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోతుగంటి రామస్వామి (98) ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. కాగా, రామస్వామి పార్థివ దేహాన్ని మానుకోట మెడికల్ కళాశాలకు అప్పగించడానికి కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. ప్రముఖ కవి కాళోజీ నారాయణరావు, తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో రామస్వామి తన భౌతిక కాయాన్ని మెడికల్ కళాశాలకు దానం చేయాలని గతంలో నిర్ణయం తీసుకున్నారని ఆయన కుమార్తె గుండోజు జనాభాయి తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ జిల్లా కన్వీనర్ పరకాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రామస్వామి పార్థివదేహాన్ని మానుకోట మెడికల్ కళాశాలకు దానం చేయడం అభినందనీయమన్నారు. కాగా, రామస్వామి పార్థివదేహానికి పట్టణానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు రాపర్తి యాదగిరి, నూకల లింగారెడ్డి, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం లీగల్ అడ్వైజర్ భువనగిరి రవీంద్ర గుప్తా, స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం రాష్ట్ర ప్రతినిధి సింగు రమేష్, సమరయోధుల వారసులు చిదిరాల శరత్, మాలే హేమచందర్, జనాభాయి, కృష్ణ చైతన్య, ప్రియాంక, దూదికట్ల నవీన్, చిట్టోజు సుదర్శనాచారి, గుండోజు సరస్వతి, సుగుణ, పీఆర్.నాగేందర్ తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


హరిప్రసాద్ (ఫైల్)

రాయపర్తి: కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కాలేదనే కారణంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొత్తూరులో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కొండ్ర హరిప్రసాద్ (27) పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష రాశాడు. కొన్ని నెలల క్రితం ఫలితాలు వెలువడగా ఇందులో అర మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోయాడు. దీంతో కొంతకాలంగా మనోవేదనకు గురవుతున్న హరిప్రసాద్.. ఆదివారం ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనతో కుటుంబీకులు శోకసంద్రంలో మునిగారు. మృతుడికి తల్లిదండ్రులు శ్రీనివాస్, స్వరూప ఉన్నారు.

డబ్బులు కట్టించుకున్నారు.. చెల్లించడం లేదు

- మహర్ష డెవలపర్స్ ఏజెంట్లు, బాధితుల ఆందోళన


స్టేజీపై ఆందోళన చేస్తున్న బాధితులు

మహబూబాబాద్ రూరల్ : మహర్ష డెవలపర్స్ లిమిటెడ్ గ్రూప్‌లో పాలసీలు చెల్లించిన వారికి ఎఫ్‌డీల గడువు ముగిసినా డబ్బులు చెల్లించడం లేదంటూ సంస్థ సీఈఓను ఏజెంట్లు, బాధితులు నిలదీసి ఆందోళన చేశారు. ఈ ఘటన మహబూబాబాద్ మండలం ఆమనగల్లులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మహర్ష డెవలపర్స్ లిమిటెడ్ గ్రూపు దశమ వార్షికోత్సవం ఆదివారం ఆమనగల్లులో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కంపెనీ సీఈఓ గుడిబోయిన వెంకటేశ్వర్లు హాజరయ్యారు. పాలసీలు, ఎఫ్‌డీల పేరుతో వసూలు చేసిన డబ్బులను గడువు ముగిసినా చెల్లించడం లేదంటూ సంస్థ నిర్వాహకులతో ఏజెంట్లు, బాధితులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా బాధితురాలు జయమ్మ, ఏజెంట్ స్వరూప మాట్లాడుతూ సంవత్సరం నుంచి వరంగల్‌లోని సంస్థ కార్యాలయం మూసి ఉంటుందని, ఫోన్ చేస్తే సమాధానం లేదన్నారు. గడువు ముగిసిన వారికి డబ్బులు ఇవ్వకుండా వెంచర్‌లో ప్లాట్లను బలవంతంగా అంట గడుతున్నారని వాపోయారు. ఈ సందర్భంగా మహర్ష గ్రూప్ డెవలపర్స్ లిమిటెడ్ సీఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో బాధితులు శాంతించారు.

తండ్రిని కడతేర్చిన కొడుకు..

- చెల్లెళ్లకు భూమి పట్టా చేసినందుకు ఘాతుకం..
- సిరిసన్నగూడెంలో ఘటన


వెంకటయ్య (ఫైల్)

పాలకుర్తి టౌన్ : మానవ సంబంధాలు ఆర్థిక సంబంధాలుగా మారిన నేపథ్యంలో మనుషుల మధ్య బంధాలు తెగిపోతున్నాయి. ఆస్తుల కోసం బంధాలు తెంచుకుటున్నారు. అందుకు సాక్ష్యమే ఈ ఘటన. ఆస్తి కోసం కన్న తండ్రిని కొడుకు హత్య చేశాడు. ఈ ఘటన జనగామ జిల్లా పాలకుర్తి మండలం సిరిసన్నగుడెంలో చోటుచేసుకుంది. ఎస్సై తాళ్ల శ్రీకాంత్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన గాయాల వెంకటమ్మ, వెంకటయ్య(70) దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అందరికీ కొన్ని సంవత్సరాల క్రితమే పెళ్లిళ్లయ్యాయి. వెంకటయ్యకు మొత్తం 8 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 2 ఎకరాల భూమిని తను ఉంచుకుని మిగతా భూమి కుమారుడు పేరున పట్టా చేయించాడు. అప్పట్లో ఇద్దరు కూతుళ్ల తాళ్లపెల్లి రేణుక పేరున 20 గుంటలు, భాస్కుల లక్ష్మి పేరిట 20 గంటల భూమిని పట్టా చేయించాడు. మొత్తం ఎకరం భూమిని ఇద్దరి కూతుళ్లకు పసుపు, కుంకుమల కింద ఇస్తానని ఒప్పుకున్నాడు. ఒప్పుకున్న ప్రకారమే గత నెలలో ఇద్దరి కూతుళ్లకు చెరో 20 గుంటల చొప్పున పట్టా చేయించాడు. అప్పటి నుంచి తండ్రి, కొడుకుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం సాయత్రం పొలం వద్ద ఇరువురి మధ్య మాటలు పెరగడంతో ఆగ్రహానికి గురైన కు మారుడు నర్సింహా.. కర్రతో తండ్రి తలపై బలంగా కొట్టాడు. దీంతో వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- లక్నెపల్లిలో ఘటన


తీవ్రగాయాలైన ఎల్లగౌడ్

నర్సంపేట రూరల్ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన నర్సంపేట మండలం లక్నెపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామానికి చెందిన గంధం సంజీవ (23) పత్తి వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వ్యాపారంలో భాగంగా జగిత్యాల జిల్లా నుంచి సంజీవతోపాటు మరో నలుగురు వరంగల్ జిల్లా నర్సంపేట మండలానికి చేరుకుని పలు గ్రామాల్లో పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై నర్సంపేట నుంచి వరంగల్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో లక్నెపల్లి గ్రామం వద్ద సంజీవ ద్విచక్రవాహనం, నర్సంపేట పట్టణంలోని సర్వాపురం గ్రామానికి చెందిన మేర్గు ఎల్లగౌడ్ ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇరువురికి తీవ్రగాయాలు కావంతో వెంటనే స్థానికులు 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి సంజీవ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఎల్లగౌడ్‌కు తీవ్రగాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు. సంజీవ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైరవి తెలిపారు.

విషపు క్రీడలు..

ఆన్‌లైన్ గేమ్స్‌లో చిక్కుకున్న యువత

- అప్పులపాలై చివరకు ఆత్మహత్యలు
- శోకసంద్రంలో ఆయా కుటుంబాలు
- అవగాహన కల్పించాలని వేడుకోలు



ఆన్‌లైన్ గేమ్స్‌తో ఎంతో మంది జీవితాలు నాశనమవుతున్నాయి. సామాన్య, మధ్య తరగతి, ధనిక వర్గాలకు చెందిన యువతతో పాటు మధ్య వయసు కలిగిన వారు కూడా ఆన్‌లైన్ ఉచ్చులో పడుతున్నారు. కష్ట పడకుండా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఆన్‌లైన్ క్రీడల్లో పాల్గొంటున్నారు. తక్కువ డబ్బులు పెట్టి ఎక్కువ పొందాలనే ఆశతో ఆన్‌లైన్ జూదం వైపు మరలుతూ చివరకు అప్పులపాలై క్షణికావేశంలో బలవన్మరణలకు పాల్పడుతున్నారు. దీంతో ఆయా కుటుంబాలు కన్నీటి సంద్రంలో మునుగుతున్నాయి.

నర్సంపేట: నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తున్నారు. ఈ ఫోన్ల కారణంగా పిల్లలు ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతుంటే.. యువకులు, ఆపై పడిన వారు పెడదారి పడుతున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో అనేక క్రీడలకు సంబంధించి బెట్టింగ్‌లకు పాల్పడడం, రుణాలు తీసుకోవడం, ఆఫర్ల పేరుతో మోసపోతూ దిక్కుతోచని స్థితికి చేరుకుంటున్నారు. ఇందులో ప్రధానంగా ఆన్‌లైన్ బెట్టింగ్, రమ్మీ, లూడో, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌తో పాటు అనేక రకాల ఆన్‌లైన్ గేమ్స్ ఆడి అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారు. కొంత మంది తేరుకొని వీటికి దూరమవుతుంటే చాలా మంది తమ ఆస్తులను విక్రయించుకునే దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తల్లిదండ్రులకు తెలియకుండా వాహనాలు, ఆభరణాలు కూడా తనఖాలు పెట్టి జూదం ఆడుతున్నారు. నర్సంపేట పట్టణంలోని ఓ బ్యాంకు అధికారి కొద్ది రోజుల క్రితం బ్యాంకుకు సంబంధించిన డబ్బులతో ఆన్‌లైన్ గేమ్స్ ఆడి కోట్లాది రూపాయలు పోగొట్టుకున్నాడు. దీంతో చివరకు జైలు పాలయ్యాడు. ఇలా పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ఎంతో మంది యువకులు మోసపోతున్నారు.

అవగాహన లేక అవస్థలు..

పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువత నిత్యం స్మార్ట్ ఫోన్లతో గడిపేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆన్‌లైన్ గేమ్స్ బారిన పడుతున్నారు. ఫలితంగా ఆయా కుటుంబాలు రోడ్డున పడుతున్న పరిస్థితి ఏర్పడుతోంది. కాగా, యువతకు అవగాహన లేకపోవడంతోనే ఆన్‌లైన్ గేమ్స్ ఆడి ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్ గేమ్స్‌పై యువతకు అవగాహన కల్పించి ఆయా కుటుంబాలను శోకసంద్రం నుంచి రక్షించాలని పలువురు పేర్కొంటున్నారు.

మచ్చుకు కొన్ని ఘటనలు..



నెక్కొండ మండలం అప్పల్‌రావుపేటకు చెందిన బాషబోయిన ఉదయ్(20) ఈ ఏడాది జూన్ 24న అర్ధ రాత్రి ఆన్‌లైన్ గేమ్ ఆడాడు. కాగా, ఉదయ్ మొబైల్ ఫోన్‌కు తల్లి స్వప్న పేరిట బ్యాంకు ఖాతా అనుసంధానమై ఉంది. ధాన్యం అమ్మిన డబ్బులు రూ.50 వేలు ఆమె బ్యాంకు ఖాతాలో అదే రోజు ఉదయం జమ అయ్యాయి. రాత్రి ఒంటరిగా ఉన్న ఉదయ్(రమ్మీ) ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండగా రూ.46 వేలు పోగొట్టుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు మందలిస్తారని భయపడిన ఉదయ్.. ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



నర్సంపేట పట్టణంలోని మాధన్నపేట రోడ్డులో ఉంటున్న మిట్టపల్లి సాయిబాబా, మమత దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరి కుమారుడు ప్రశాంత్ నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. సుజాత అనారోగ్యంతో పదేళ్ల క్రితం మృతి చెందింది. సాయిబాబా దర్జీ(టైలర్) పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రశాంత్ ఆన్‌లైన్ గేమ్‌తో మోసపోవడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన ప్రశాంత్ నవంబర్ 22న ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

కొమ్మ కత్తిరింపులతో అధిక దిగుబడి

- మల్లెపూల తోట పెంపకంలో మెళకువలు


మల్లె తోట

చెన్నారావుపేట: మల్లె పూలను ఇష్టపడని వారుండరు. వివాహ వేడుకల్లో, పూజలకు ఎక్కువగా వినియోగిస్తారు. స్త్రీలు మల్లెపూలను ఎక్కువగా ఇష్టపడడం సహజం. మల్లెపూలకు మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ. మల్లెపూల దిగుబడి భారీగా రావాలంటే తోటల్లో కొమ్మ కత్తిరింపులు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. మొక్కల పెరుగుదల, కొత్త చిగుర్లు, మొగ్గలు వచ్చి పూలు అధికంగా పూస్తాయి. ఇవన్నీ కొమ్మ కత్తిరింపుల మీదే ఆధారపడి ఉంటాయి. కొత్త చిగుర్లపై పూలు పూస్తాయి. సకాలంలో కత్తిరింపులు చేపడితే కొత్త కొమ్మలు ఎక్కువ సంఖ్యలో వచ్చి వాటిపై పూలు పూస్తాయి. ఒక్కో జాతి మల్లె ఒక్కో సీజన్‌లో అధిక పూల దిగుబడిని ఇస్తుంది. రైతులు మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సకాలంలో కొమ్మలను కత్తిరించాలని ఉద్యాన శాఖ అధికారి రమేశ్ తెలిపారు.

వర్షాకాలం ముగిసిన తర్వాత మొక్కలకు నీరు పెట్టడాన్ని ఆపేయాలి. డిసెంబర్–జనవరి మధ్యకాలంలో రాత్రి ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు తక్కువగా ఉంటాయి. ఆ సమయంలో మొక్కల నుంచి ఆకులు రాలుతాయి. కొమ్మలన్నిటిని దగ్గరికి చేర్చి తాడుతో కడితే ఆకులు త్వరగా రాలుతాయి. కొన్ని సందర్భాల్లో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల వల్ల ఆకులు రాలవు. అలాంటి పరిస్థితుల్లో రైతులు కూలీలతో ఆకులను దుయ్యిస్తుంటారు. ఐతే ఇది ఖర్చుతో కూడిన పని. ఈ సమస్యను అధిగమించాలంటే లీటర్ నీటికి 3 గ్రాముల చొప్పున పెటోక్లోరోఫినాల్ కలిపి పిచికారీ చేయాలి. తద్వారా వల్ల ఆకులు రాలి కొత్త కొమ్మలు వస్తాయి. కొమ్మలు కత్తిరించలేని రైతులు తప్పనిసరిగా ఆకు రాల్చే ముందు పిచికారీ చేయాలి.

కొమ్మ కత్తిరింపు పద్ధతి

ఆకులు రాలిన తర్వాత కొమ్మలు కత్తిరించాలి. ఒక్కో జాతి మొక్కకు ఒక్కో విధంగా కత్తిరింపులు చేయాల్సి ఉంటుంది. జాస్మినమ్ సాంబక్ (గుండు మల్లె) జాతి మొక్కలకు డిసెంబర్ 15 వరకు కత్తిరింపులు చేయాలి. దీంతో మార్చి నుంచి జూన్ వరకు పూల దిగుబడి పొందవచ్చు. కొమ్మల్ని భూమి నుంచి 50–75 సెంటీమీటర్ల ఎత్తుల్లో లేదా 7 నుంచి 12వ కణువు దగ్గర కత్తిరించాలి. అలాగే జాస్మినమ్ గ్రాండిఫొరం (జాజిమల్లె) జాతి మొక్కలకు సంబంధించి డిసెంబర్ చివరి వారంలో భూమి నుంచి 90 సెంటీమీటర్ల ఎత్తులో లేదా 13వ కణువు వద్ద కొమ్మల్ని కత్తిరించాలి. ఇక జాస్మినమ్ అరిక్యూలేటమ్ (కాగడ మల్లె) జాతి మొక్కల్లో డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి 3వ వారం వరకు భూమి నుంచి 40–50 సెంటీమీటర్ల ఎత్తులో కొమ్మల్ని కత్తిరించాలి. కత్తిరింపుల సమయంలో ఎండు కొమ్మలు, సన్నగా ఉన్న కొమ్మల్ని గుర్తించి వాటిని కూడా తొలగించాలి. కత్తిరింపులు పూర్తయిన వెంటనే సిఫార్సు చేసిన ఎరువులు వేయాలి. కొమ్మలను 15–20 రోజుల తేడాతో 2–3 దఫాలు కత్తిరించాలి. తర్వాత నీరు, ఎరువులు అందిస్తే చాలా కాలం పాటు పూల దిగుబడి పొందవచ్చు.

నీరు పెట్టు సమయం

చలికాలంలో 10 రోజులకు, వేసవిలో 5,6 రోజులకు ఒకసారి మొక్కల దగ్గర నీటి తడి ఇవ్వాలి. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూత సమయంలో తోటకు నీటి ఎద్దడి ఏర్పడకూడదు. మొదటి విడత పూల కోత తర్వాత తోటను బెట్టకు గురి చేసి మొక్కల పెరుగుదలను నియంత్రించాలి. తర్వాత నీరందిస్తే ఒక్కసారిగా కొత్త చిగుర్లు వచ్చి పూలు పూస్తాయి. బరువు నేలల్లో నీటి తడుల విషయంలో నియంత్రణ లోపిస్తే మొక్కలు ఏపుగా పెరిగి పూల దిగుబడి తగ్గుతుంది. నవంబర్‌లో కత్తిరింపులు చేస్తే చలికాలం చివరి వరకు నీటితడులు తగ్గించాలి. సరైన నీటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే జూన్ నెలాఖరు వరకు పూల దిగుబడి తగ్గదు.

పాదుల తవ్వకం..

పాదులను నెలకోసారి తవ్వితే మొక్కల పెరుగుదల బాగుంటుంది. తోటను బెట్టకు గురి చేసినప్పుడు పాదుల తవ్వకంతో సత్ఫలితం ఉంటుంది. సాంబాక్ జాతి మొక్కలకు నీటి తడులు సరిగా ఇవ్వకుండా నత్రజని ఎరువును ఎక్కువ మోతాదులో వేస్తే కొమ్మలు తీగలుగా పెరిగే అవకాశం ఉంది. తీగలుగా పెరిగే కొమ్మల చివర్లను తుంచేస్తే పక్క కొమ్మలు వచ్చి పూల దిగుబడి పెరుగుతుంది. మొక్కలు పెరుగుతున్నప్పుడు లీటర్ నీటిలో రెండు గ్రాముల చొప్పున సూక్ష్మధాతు మిశ్రమాన్ని కలిపి 1–2 సార్లు పిచికారీ చేస్తే పూల దిగుబడి బాగుంటుంది.